
# సత్యవాక్కు

సంపుటి -42 ఆగష్టు - 2020 సంచిక - 1



AUG - 2020

ఆగష్టు - 2020

## క్రైస్తవ మాసపత్రిక

సంవత్సర సభ్యత్వము రూ॥ 50/-

## టి.వి. ద్వారా క్రీస్తు సంఘముల సువార్త పరిచర్యలు

### సత్యవాణి

| | | |
|---|---|---|
| ఆదివారం సాయంత్రం | : | 6.00 గంటలకు శుభవార్త |
| బుధవారం సాయంత్రం | : | 6.30 గంటలకు రక్షణ |
| గురువారం మధ్యాహ్నం | : | 2.30 గంటలకు రక్షణ |
| ప్రతిరోజు ఉదయం | : | 7.30 ని॥ కాంతి ఛానల్‌లో |
| ప్రతిరోజు మధ్యాహ్నం | : | 3.30 ని॥ కాంతి ఛానల్‌లో |
| ప్రతి శనివారం ఉదయం | : | 6.30 ని॥లకు ఆరాధన |
| ప్రసంగీకులు | : | జాషువా గూటం |
| | | రిక్కీ గూటం |
| | | రోనీ గూటం |

**Youtube లో satyavanicoc.kkd లో**

పై కార్యక్రమములను చూడండి

మీ బంధుమిత్రులను కూడా ప్రోత్సహించండి.

ఉచిత బైబిలు కోర్సు కొరకు మాకు ఈరోజే వ్రాయండి

**SATYA VANI**

**P.O.BOX. 80, KAKINADA**

**PIN : 533004. Ph : 0884 - 2363722**

**98489 98547, www.satyavanicoc.com**

# సత్యవాక్కు

పోస్టు బాక్స్ - 80, కాకినాడ
ఆంధ్రప్రదేశ్ - 533 001.
ఫోన్ : 0884-2363722, సెల్ : 98489 98547
ఎడిటర్ : జాషువా గూటం

క్రొత్త నిబంధన క్రైస్తవ పునరుద్ధరణ కొరకు

సంపుటి - 42 ఆగష్టు - 2020 సంచిక -1

## నశించిపోవుట అనగా యేమిటి?

మానవులందరి హృదయములలో భయమును పుట్టించవలసిన బైబిలు మాట ఒకటి యున్నది. అది నశించి పోవుట అనునది. నశించిపోవుట అనగా ఆత్మీయముగాను, మానసికము గాను అధోగతికి పాలై అంధత్వములో యున్న మానవులను అది సూచించు చున్నది. నశించిపోవుట అనగా ఒకడు పావమువలన దేవుని నుండి విడిపోవుట: "పాపము చేయువాడే మరణము నొందును" అని దేవుని ప్రవక్త ప్రకటించెను (యెహెజ్కేలు 18:4). మంచి చెడ్డలను తెలియజేయు వృక్షఫలములను గూర్చి దేవుడు ఆదాముకు తెలియజేయుచు, నీవు వాటిని తినకూడదు; నీవు వాటిని తిను దినమున నిశ్చయముగా చచ్చెదవని చెప్పెను (ఆది 2:17). ఆదాము ఆ వృక్షఫలములను తినిననాడే దేవుని నుండి వేరు చేయబడెను. దేవుని నుండి వేరు చేయబడుటయే ఆత్మీయ మరణము. అయితే పాపము వలన వచ్చు జీతము మరణము అని రోమా 6:23లో అపొ.పౌలు చెప్పుచున్నాడు.

నశించిపోవుట యనగా దేవునితో సహవానము కలిగి యుండుట వలన లభించు ఆశీర్వాదము అన్నిటినుండి దూరమై పోవుట యని అర్ధము. పాపియైన మానవుడు భౌతికముగా మంచి

ఆరోగ్యమును, శరీరబలమును, మంచి ఉద్యోగమును కలిగియుండ వచ్చు నేమో గాని యేసుక్రీస్తులో లభించే ఆత్మీయాశీర్వాదములు అతనికి ఏమియు దొరకవు. "ఆయన చెడ్డవారి మీదను, మంచివారి మీదను తన సూర్యుని ఉదయింపజేసి, అనీతి మంతుల మీదన్ను వర్షము కురిపించు చున్నాడు" (మత్తయి 5:45). అయితే పాపియైన వాడు వ్యక్తిగతముగా దేవునితోను, క్రీస్తు తోను సంభాషించే హక్కును పోగొట్టుకొనును. అందువలన తాత్కాలిక సుఖ సంతోషముల కొరకు అతడు లోకములో వాటిని వెదకును.

**నశించిపోవుట యనగా సాతాను సామ్రాజ్యములో పడవేయబడుట యని అర్థము.** పాపము చేయువారు పాపమునకు దాసులు (యోహాను 8:34; రోమా 6:17). సాతానుడు లేక అపవాది వారి యజమాని. ఏలయనగా "నా పక్షమున నుండనివాడు నాకు విరోధి" యని యేసు చెప్పెను (మత్తయి 12:30). ఆత్మీయముగా మధ్యస్థితి ఏమియు లేదు. అయితే మనము ప్రభువు పక్షమున యున్నామా లేదా అపవాది పక్షమున యున్నాము. అందుకే నా పక్షమును నుండని వాడు నాకు విరోధి, నాతో కలసి సమకూర్చని వాడు చెదరగొట్టువాడని యేసు బోధించెను. ఆత్మీయముగా నశించిన వారందరు అపవాది పక్షమున నున్న వారు.

**నశించిపోవుట యనగా దేవుడిచ్చు నిత్య జీవిత నిరీక్షణను పోగొట్టుకొనుట యని అర్థము.** పాపమువలన మానవుడు ఈ జీవితములోనే దేవుని నుండి వేరుచేయబడినందున అతడు పాపములో యుండి మరణించిన యెడల దేవుని నుండి నిత్యము వేరు చేయబడును. మానవుడు దేవునితో వ్యక్తిగత సంబంధము కలిగి ఆయన సహవాసమును ఈ లోకములోను, నిత్య జీవితములోను అనుభవించు నట్లు దేవుడు మానవుని తన స్వరూప మందు, తన పోలిక చొప్పున చేసెను. అయితే నశించినవారు ఈ తరుణ మును పోగొట్టుకొన్నవారు. వారెందు నిమిత్తమయితే దేవునిచే సృజింపబడిరో ఆ ప్రయోజనమును కేవలము కోల్పోయినవారు. అందు వలన వారు

నిరీక్షణ లేనివారు.

**నశించిపోవుట యనగా నిత్య శిక్షకు గురియగుటయని అర్థము.** ఈ నిత్యశిక్ష స్థలమును బైబిలు 'నరకము' అని చెప్పుచున్నది. ఈ శిక్షకు అంతము ఉండదు. పాతాళములో అపవాదితోను, వాని దూతలతోను నశించినవారు నిత్యము గడుపుదురు. నశించినవారు అందరు పొందబోయేది నిత్య నరక శిక్షయే. ఇది బహువిచారకరము. అయితే యిది నిజము.

**ఎవరెవరు నశించు చున్నారు?** అయితే ఈ నశించిపోవుచున్న వారెవరు? వారు సువార్తను ఎన్నడు విననివారా? లేక ప్రతి ఆదివారము ఆరాధనకు వెళ్ళుచున్న నా పొరుగువాడా? లేక నా కుటుంబ సభ్యులెవరయిననా? లేక క్రీస్తు సంఘస్థులా? చివరకు ఈ నశించిపోవుచున్నది నేనా? యని మనము అడుగవచ్చును. అవును వీరిలో ఎవరయినను సరే నశించిపోగలరు. మన మెవరిమో అనే విషయముపై కాదుగాని మనమేమై యున్నామో అనుదానిపై మనము రక్షింప బడితిమో లేక నశించి పోవుచున్నామో నిర్ణయించబడగలదు.

దేవుని గూర్చియు, సువార్తను గూర్చియు ఎన్నడు విననివారు నశించి పోవువారు. వయస్సు వచ్చినవారైతే వారు పాపులు గనుక వారు నశించిన వారు. వారు సువార్తను వినలేనందున కాదు గాని వారి పాపములవలన వారు నశించినవారు. అందుకే "మీరు సర్వలోకమునకు వెళ్ళి సర్వసృష్టికి సువార్తను ప్రకటించుడి; నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షించబడును; నమ్మనివానికి శిక్ష విధించబడును." అని యేసు తన శిష్యుల కాజ్ఞాపించెను. పాపముల నుండి రక్షించబడవలెనంటే ప్రతిమానవునికి యేసుక్రీస్తు అవుసరమై యున్నారు. ఆయన లేనియెడల మానవులందరు నిత్యము నశించి పోవుదురు. సువార్తను వినియు దానికి విధేయత చూపనివారు నశించి పోయినవారు.

భక్తిగల క్రైస్తవులవలె నటించు వారు నశించిపోయినస్థితిలో యున్న వారు. వారు చేసేవి తప్పుడు పనులని కాదు గాని, సరియైనవి వారు చేయక పోయినందున వారు నశించిన వారు.

మానవుడు కేవలము పుణ్యకార్యముల వలననే రక్షింపబడజాలడు. పుణ్య కార్యములు కాదుగాని క్రీస్తు రక్తము అతనిని రక్షించును. బాప్తిస్మమనే క్రొత్త జన్మలో క్రీస్తు రక్తము దరికి ఒకడు చేరి తన పాపములు కడుగుకొను వరకు అతడు నశించినవాడే. పైకి భక్తిగల వారివలె ఎంత నటించినను, సత్య సువార్తకు విధేయులుకాని వారందరు పాపములలో నశించినవారే యగుదురు.

**అబద్ధ బోధకులు** : కొందరు అత్యాసక్తికలిగి తమ అబద్ధ సిద్ధాంతము లను వ్యాప్తిచేయుటకు చాల కృషి చేయు చుందురు. అట్టివారు కూడ నశించిన వారే. వారి ఆసక్తిని మనము మెచ్చుకో వచ్చునుగాని వారు సత్యమునకు భిన్నమైన బోధలను చేయుట వలన నాశనమొందెదరు. యిట్టివారు తమ శాఖలలో ప్రజలను కలుపుకొనుటకు సముద్రమును భూమిని చుట్టివచ్చెదరు. ఒకడు వారిలో కలిసినప్పుడు అతనిని రెండంతలు నరకపాత్రునిగా చేయుదు రని యేసు మత్తయి 23:15లో హెచ్చరించెను. ఆసక్తి ఒక్కటిమాత్రమే యెవనిని రక్షించదు. మానవులకు యెంత ఆసక్తి యున్నను వారు క్రీస్తు సువార్తకు విధేయత చూపని యెడల నశింతురు.

**బంధువులు** : మనకు తెలియ దేమోగాని, మన కుటుంబ సభ్యులు, మనదగ్గిర సంబంధులే నశించిపోయే అవకాశమున్నది. వారు దుర్మార్గులు కాదు, మంచివారే అని మనము అనుకొనుచుండ వచ్చును. మనము వారికి సన్నిహితముగా యున్నంత మాత్రమున దేవుని యెదుట వారి ఆత్మీయస్థితి మార్చబడదు. వారు రక్షించబడవలెనన్న దేవుని ఆజ్ఞలకు వారు కూడ విధేయత చూపించ వలసినదే. లేనియెడల వారు కూడ తమ పాపములలో నశించి పోవుదురు. వారి యెడల మనకున్న ప్రేమనుబట్టి వారు నశించిపోరు అని మనము అనుకొనుచుండవచ్చును గాని, మన తలంపులు దేవుని వాక్యము యెదుట ఎందుకు పనికిరావు.

**సంఘసభ్యులు** : అయితే క్రీస్తు సంఘసభ్యులు నశింతురా? అనే ప్రశ్న మనకు రావచ్చును. మనము ఒక

స్థానిక సంఘములో సభ్యులుగా యున్నంత మాత్రమున రక్షింపబడి పోలేము. క్రీస్తు సంఘస్థులైన తరువాత తిరిగి పాపము లోబడి జీవించుచున్న వారనేకులు కలరు. అట్టివారు నశించి పోవుచున్న వారే. వారు మారుమనస్సు పొంది తమ పాపములను దేవుని యెదుట ఒప్పుకొనని యెడల నిత్య నాశనము లోనికి పోవుదురు. క్రీస్తు లోనికి, ఆయన సంఘములోనికి చేర్చబడినవారు మరణ పర్యంతము నమ్మకముగా యుండవలెను. ఆత్మీయ ముగా బలపడినవారు బలహీన సభ్యులను సాత్వీక మైన మనస్సుతో మంచిదారికి తీసికొని రావలెనని గలతీ 6:1 హెచ్చరించు చున్నది.

నేను నశించిపోగలవా? అనే ప్రశ్న మనము ఇప్పుడు అడుగవచ్చును. అవును అదియును సాధ్యమే. అయితే అట్టిది సాధ్యము కాకుండు నిమిత్తము మనలో ప్రతివాడును తన విషయమై జాగ్రత్తగా చూచుకొనవలెను. అందుకే "నిబ్బరమైన బుద్ధిగలవారై మెలకువగా ఉండుడి; మీ విరోధియైన అపవాది గర్జించు సింహమువలె ఎవరిని మ్రింగుదునా అని వెదకుదుచు తిరుగుచున్నాడు" అని అపొ. పేతురు మనలను హెచ్చ రించుచున్నాడు (1 పేతురు 5:8). గనుక "మీరు విశ్వాసము గలవారై యున్నారో లేదో మిమ్మును మీరు శోధించి చూచు కొనుడి; మిమ్మును మీరే పరీక్షించు కొనుడి; మీరు భ్రష్టులు కాని యెడల యేసుక్రీస్తు మీలో నున్నాడని మిమ్మును గూర్చి మీరే యెరుగరా? మేము భ్రష్టులము కామని మీరు తెలిసికొందురని నిరీక్షించు చున్నాను" (2 కొరింథీ 13:5).

అయ్యా, నీవు ఏ స్థితిలో యున్నావు? నశించిపోవుస్థితిలో యున్న యెడల యేసుక్రీస్తు నీకు రక్షణ భాగ్యము కలుగజేయుటకు ఎల్లప్పుడు సిద్ధముగా యున్నారు. ఆయన యందు విశ్వాసముంచుము, నీ పాపముల విషయమై మారుమనస్సు పొందుము, క్రీస్తు నామమును ఒప్పుకొనుచూ నీటిలో ముంచడము పొందుము. ఆయన నీ పాపములను క్షమించి నిన్ను రక్షించును. యేసుక్రీస్తనే జగద్రక్షకు డుండగా మనమేల నశించవలెను?

# శత్రుప్రియులు

క్రైస్తవులకు శత్రువులు కలరు. దైవ చిత్తానుసారముగా అపొస్తులుడయిన పౌలు తన ప్రియకుమారునిగా భావించిన తిమోతికి వ్రాసిన రెండవ పత్రికలోని 3:12 వచనం ఈలాగున్నది. "క్రీస్తుయేసు నందు సద్భక్తితో బ్రదుకనుద్దేశించు వారంతా హింస పొందుదురు". అనగా క్రైస్తవునిగా కొనసాగరాదని కాదు గాని నిజభక్తితో జీవించిన యెడల శ్రమలకు గురియగుచు తక్షణఫలము పొందలేమనియు మరియు హింసపొందుట తప్పదనియర్థము. ఒకనాడు క్రీస్తుకొండ పై ప్రసంగిన్నా "నేను మీతో చెప్పునదేమనగా, మీరు పరలోకమందున్న మీ తండ్రికి కుమారులైయుండునట్లు మీ శత్రువులను ప్రేమించుడి" (మత్తయి 5:44) అనెను. నిన్నువలె నీ పొరుగు వానిని ప్రేమిం చుడని తండ్రి ఆజ్ఞగా చెప్పిన క్రీస్తు మాట కూడ మనకత్యవసరము. అనగా క్రైస్తవులు వారి మిత్రులనే కాక శత్రువులను కూడ ప్రేమించుచుండవలెనన్నమాట.

పై సువార్త 20:22 యేసు నామము నిమిత్తము అందరిచేత ద్వేషింప బడుదురని ఆయనే చెబుతూ అంతము వరకు సహించగలుగు వాడు రక్షింపబడుననెను. అదేవిధముగా నా నామము నిమిత్తము జనులు మిమ్మును నిందించి హింసించి మీ మీద అబద్ధముగా చెడ్డమాట లెల్ల పలుకు నప్పుడు మీరు ధన్యులు. సంతోషించి ఆనందించుడి... (మత్తయి 5:11,12). అట్టి సమయాలలోనే"... సంతోషించి గంతులు వేయుడి; ఇదిగో మీ ఫలము పరలోకమందు గొప్పదై యుండును; వారి పితరులు ప్రవక్తలకు అదేవిధముగా చేసిరి" (లూకా 6:22, 23) అని కూడ పలికెను.

క్రైస్తవుడు ప్రపంచానికే శత్రువు. "ఈలోకమునైనను ఈ లోకములో ఉన్న వాటినైనను ప్రేమింపకుడి. ఎవడైనను లోకమును ప్రేమించిన యెడల తండ్రి ప్రేమ వానిలో నుండదు. లోకములో ఉన్నదంతయు, అనగా శరీరాశయు నేత్రాశయు

జీవపుడంబమును తండ్రి వలన పుట్టినవికావు; అవి లోక సంబంధ మైనవే. లోకమును దాని ఆశయ గతించిపోవుచున్నవి గాని, దేవుని చిత్తమును జరిగించువాడు నిరంతర మును నిలుచును" (1 యెహాను 2:15-17). అట్లే క్రీస్తు దాసు డయిన యాకోబు వ్రాస్తూ... " ఈ లోక సేన్రహము దేవునితో .వైరమని మీరెరుగరా? కాబట్టి ఎవడు ఈ లోక ముతో స్నేహము చేయగోరునో వాడు దేవునికి శత్రువగును... కాబట్టి దేవునికి లోబడి యుండుడి. అపవాది (సాతాను) ని ఎదిరించుడి. అప్పుడు వాడు మీ యొద్ద నుండి పారిపోవును. దేవుని యొద్దకు రండి, అప్పుడాయన మీ యొద్దకు వచ్చును..."(యాకోబు 4:4-8). అట్లే నీతికి దుర్నీతితో సాంగత్యముండరాదని, వెలుగుకు చీకటితో పొత్తు లేనేలేదని, ఆలాగే క్రీస్తు కు బెలియాలు (సాతానుని సార్ధక నామము)తో సంబంధము లేనట్లే అవిశ్వాసితో విశ్వాసికి పాలెక్కడిదని మరియు దేవుని ఆలయమునకు విగ్రహాలతో పొందిక యుండదని 2 కొరింథీ 6:14-17 చెబుచున్నది. "ఇంకను నిష్ఫలమైన అంధకార క్రియ లలో పాలివారై యుండక వాటిని ఖండించుడని" కూడ పరిశుద్ధ గ్రంధము పిల్లలవలె దేవుని పోలిన ప్రియులను హెచ్చరించుచునే యున్నది (ఎఫెసీ 5:11).

క్రీస్తు మనతో నుండగా మనమే దైనను సహించగలము. పైనుదహ రించ బడిన మత్తయి 10:22కు తోడుగా, "ఇదిగో మీరు శోధింపబడు నట్లు అపవాది (దుష్టుడు) మీలో కొందరిని చెఱలో వేయింప బోవు చున్నాడు; పది దినములు శ్రమ కలుగును; మరణము వరకు (ప్రాణా పాయము వచ్చినను) నమ్మకముగా నుండుము. నేను నీకు జీవకిరీట మిచ్చె దన"ని కూడ (ప్రకటన 2:10లో) వ్రాయించి ధైర్యపరచు చున్నాడు. అయితే క్రీస్తు దాసుడైన అపొ. పౌలుచే ఫిలిప్పీయులోనున్న సంఘమునకు అనగా, క్రీస్తుయేసు నందలి సకల పరిశుద్ధలకును. అధ్యక్షు లకును, పరి చారకులకును శుభసూచ కముగా (ఫిలిప్పీ 4:13లో) వ్రాయించుచు, నన్ను బలపరచు వానియందే నేను

సమస్తమును చేయగలన"ని తెల్పెను. దైవప్రేరణతో వ్రాయబడిన వాక్కున కనుగుణముగా క్రైస్తవుడు ప్రవర్తించి సువార్తసేవలో పాల్గొనుట, లేక దానిని ప్రోత్సహించుట చేయవలెను. అపొ॥ పౌలు ద్వారా 1 కొరింథీ 10:13లో ఇట్లు చెప్పబడెను–"సాధారణముగా మనుష్యులకు కలుగు శోధన తప్ప మరి ఏదియు మీకు సంభవింపలేదు. దేవుడు నమ్మదగినవాడు; మీరు సహింపగలు గుటకు ఆయన శోధనతో కూడ తప్పించుకొను మార్గమును కలుగ జేయుసు". అయినను దేవునిచే పిలువ బడిన అనేకులు ఏర్పరచబడిన వారు కారు.

దేవుడు మన పక్షమైయుండగా మనకు విరోధి (శత్రువు) ఎవడు? నీతి మంతులుగా తీర్చువాడు దేవుడు;... క్రీస్తు ప్రేమ నుండి మనలను ఎడబాపు వాడెవడు? శ్రమయైనను బాధయైనను హింసయైనను కరువైనను వస్త్రహీనత యైనను ఉపద్రవమైనను ఖడ్గమైనను మనలను ఎడబాపునా?" (రోమా 8:31 –36). నేను మీకు ఏయే సంగతులను ఆజ్ఞాపించితినో వాటన్నిటిని గైకొనవలె నని వారికి (సమస్త జనులకు) బోధించుడి. ఇదిగోనేను యుగసమాప్తి వరకు సదాకాలము మీతోకూడ ఉన్నా నని వారితో (శిష్యులతో) చెప్పెను " (మత్తయి 28:20). అదే సువార్త 5:44–48 చూడగా"... మీరు పరలోకమందు మీ తండ్రికి కుమారులైయుండునట్లు మీ శత్రువులను ప్రేమించుడి. మిమ్మును హింసించు వారి కొరకు ప్రార్థన చేయుడి..."

శత్రువులను ప్రేమించుట బహు కష్టతరమైనను భూనివాసము చేసిన మన ప్రభువైన క్రీస్తు ఇహలోక జీవితమును తలంచుచూ ఆయన బోధనలననుసరించిన యెడల కార్య సాఫల్యత నొందగలము. "యేసు–తండ్రీ, వీరేమి చేయుచున్నారో వీరెరు గరు గనుక వీరిని (ఆయనను చంపు చున్నవారిని) క్షమించుమని చెప్పెను" (లూకా 23:24). (వారెవరనగా, యేసు వలన స్వస్థతల వంటి అనేక లాభములు పొందిన జనులును, ఆయనను చంపి వేసి, ఖైదీయైన బరబ్బయను గజదొంగ ను వారికి విడుదల చేయమని ఏకగ్రీవ ముగా ప్రభుత్వమును కోరిన వారుని,

ఇంకను రక్షకునిగా ఆయన చేసిన మేళ్ళను మరచి, "వీనిని సిలువ వేయుము, సిలువ వేయుము" అను కేకలతో అరచిన వారును. అయితే దేవుడు మన యెడల తన ప్రేమను వెల్లడి పరచు చున్నాడు ఎట్లనగా మన మింకను పాపులమై యుండగానే క్రీస్తు మన కొరకు చనిపోయెను... (రోమా :8-11).

ఎస్.ఆర్. తిరుగుళ్ళ,చీపురుపల్లి

## ఓబద్యా గ్రంథము - వ్యాఖ్యానము

మూలవాక్యము : ఓబద్యా 1-21

మూలాంశయము : ఓబద్యా గ్రంథము ను చదువుకొనుటకు మరియు దీని నుండి పాఠములు (నీతి) తయారు చేసి కొనుటకు.

**పరిచయం :**

1. బైబిలులో ఒకే అధ్యాయము ఉన్న గ్రంధములను మనము చదువుదము.
2. పాతనిబంధన నుండి ఒకే అధ్యాయం ఉన్న ఓబద్యా గ్రంథమును మనం చదువుకొందము.
3. ఈ క్రింది సంగతులను మనము చదువుదము.

ఎ. గ్రంథము యొక్క నేపద్యము.

బి. గ్రంథము యొక్క అంశము.

సి. గ్రంథము నుండి వర్తమానము.

డి. గ్రంథము యొక్క క్లుప్త వివరణ.

ఇ. గ్రంథము నుండి ఆచరణాత్మక పాఠములు.

చర్చ :

I. నేపద్య సమాచారం

ఎ. గ్రంథము :

1. ఒక అధ్యాయం 21 వచనములతో కూడియున్న ఓబద్యా గ్రంథము పాతనిబంధన గ్రంథములో యున్న పుస్తకములలో చిన్నదైన పుస్తకము.

2. విలాపవాక్యముల గ్రంధము తరువాత ఇది వ్రాయబడియుండ వచ్చును.

3. క్రొత్త నిబంధనలో నేరుగా సంబోధించబడని ఏడు పాతనిబంధన పుస్తకములలో ఇది ఒకటి.

**బి. గ్రంథము యొక్క రచయిత :**

1. ఓబద్యా అనగా "ప్రభువు యొక్క దాసుడు" అని యర్థము.

2. పాతనిబంధనలో ఇంచుమించు 13మంది ఈ పేరును కలిగియున్నారు.

ఎ. హెబ్రీయుల మధ్య ఈపేరు సహజమైనది.

బి. ఈ గ్రంథము యొక్క రచయిత ఈ 13మందిలో ఎవరో తెలియదు.

3. రాజైన అహాబుదాసుడు అనేది ప్రాముఖ్యముగా ఈ సంఖ్యను గుర్తించవలెను.

ఎ. యెజెబెలు ప్రవక్తలను హింసించుచున్న కాలములో ప్రభువు యొక్క నమ్మకమైన దాసుడైన ఇతడు వందమంది ప్రవక్తలను గుహలో దాచి పెట్టి, వారికి ఆశ్రయమిచ్చి, వారిని పోషించెను (1రాజులు 18:1-4).

బి. ఏది ఏమైనప్పటికి ఇతడు ప్రభువు ప్రవక్త అని ఎక్కడా వ్రాయబడ లేదు.

4. ఇతడు దేవుని ప్రవక్త అని మరియు ఎదోమును గూర్చి ఇతని ప్రవచనం తప్ప, ఇతని గూర్చి మరేమియు తెలియదు.

**2. ఆదికాండము 36:8 "ఏశావు అనగా ఎదోము"**

**బి. ఏశావు జీవితం**

1. ఏశావు ఒకపూట కూటికొరకు తన జ్యేష్ఠత్వమును అమ్ము కొనెను.

ఎ. ఆదికాండము 25:31-33, "అందుకు యాకోబు–నీ జ్యేష్ఠత్వము నేడు నాకిమ్మని అడుగగా, ఏశావు - నేను చావబోవుచున్నాను గదా జ్యేష్ఠత్వము నాకెందుకనెను. యాకోబు - నేడు నాతో ప్రమాణము చేయుమనెను. అతడు యాకోబుతో ప్రమాణము చేసి అతనికి జ్యేష్ఠత్వమును అమ్మివేయగా"

2. ఏశావు తన తలిదండ్రులకు దు:ఖము కలుగజేసెను.

ఎ. ఆదికాండము 26:34,35, "ఏశావు నలువది సంవత్సరముల వాడైనపుడు హిత్తీయుడైన బేయేరి కుమార్తెయగు యహూదీతును హిత్తీయుడైన ఏలోను కుమార్తెయగు బాశెమతును పెండ్లిచేసికొనెను. వీరు ఇస్సాకునకును రిబ్కాకును మనోవేదన కలుగజేసిరి".

3. ఏశావు నుండి ఆశీర్వాదములను యాకోబు దొంగిలించెను.

ఎ. ఆదికాండము 27:36, "ఏశావు-యాకోబు అనుపేరు అతనికి సరిగానే చెల్లినది. అతడు నన్ను ఈ రెండు మారులు మోసపుచ్చెను. నా జ్యేష్ఠత్వము తీసికొనెను. ఇదిగో ఇప్పుడు వచ్చి నాకు రావలసిన దీవెనను తీసికొనెనని చెప్పి-నా కొరకు మరియే దీవెనయు మిగిల్చి యుండ లేదా అని అడిగెను".

బి. ఇతని జీవితం, కుటుంబం లేక ఇతని నివాసస్థలం గూర్చి ఎటువంటి బయల్పాటు లేదు.

సి. యిర్మియా 1:1-4, యెహేజ్కేలు 1:1-3, హోషేయ 1:1 మరియు ఏ రోజుల్లో వారు ప్రవచనములు చెప్పిరో చెప్పబడినది గాని ఓబద్యాను గూర్చి అటువంటి బయల్పాటు మనకు లేదు.

డి. ఈ క్లుప్త ప్రవచనములో చెప్పబడిన కొన్ని సంగతులలో మనం ఇతనిని గూర్చి తెలిసికొనియున్నాము.

**3. గ్రంథము యొక్క కీలక అంశములు :**

1. మూలపదము - విపత్తు
2. మూలవాక్యము- 10,15,21
3. మూలమాట - "తగదు" (12-14 వచనాలు)
4. గ్రంథము యొక్క ముఖ్యాంశము - ఎదోము పడిపోవుట.

**II. గ్రంథములోని అంశము :**

ఎ. ఎదోము ఏశావు యొక్క సంతానము

1. యాకోబు మరియు ఏశావులు, ఇస్సాకు మరియు రిబ్కాలకు జన్మించిన కవలలు. ఆదికాండము 25:23 "అప్పుడు యెహోవా ఆమెతో ఇట్లనెను. రెండు జనములు నీ గర్భములో కలవు. రెండు జనపదములు నీ కడుపులో నుండి ప్రత్యేకముగా వచ్చును ఒక జనపదము కంటే ఒక జనపదము బలిష్ఠమై యుండును. పెద్దవాడు చిన్నవానికి దాసుడగును అనెను".

2. ఇస్సాకు ఏశావును ఆశీర్వదించెను.

ఎ. ఆదికాండము 27:39,40, "నీ నివాసము భూసారము లేకయు పై నుండి పడు ఆకాశపు మంచు

లేకయు నుండును. నీవు నీ కత్తిచేత బ్రదుకుదువు నీ సహోదరునికి దాసుడవగుదువు. నీవు తిరుగులాడు చుండగా నీ మెడమీద నుండి అతని కాడి విరిచివేయుదువు అని అతనికి ఉత్తరమిచ్చెను.

3. ఏశావు మరియు యాకోబు సమాధానపడిరి.

ఎ. ఆదికాండము 33:4, "అప్పుడు ఏశావు అతనిని ఎదుర్కొన పరుగెత్తి అతనిని కౌగలించుకొని అతని మెడ మీద పడి ముద్దుపెట్టుకొనెను. వారిద్దరు కన్నీరు విడిచిరి".

బి. ఇశ్రాయేలీయులు మరియు ఏదోమీయుల అశాంతి బంధము.

1. ఎదోము ఇశ్రాయేలీయులను తిరస్కరించినది.

ఎ. ఇశ్రాయేలు బానిసత్వం గూర్చి ఎదోమునకు తెలియును. (సంఖ్యాకాండము 20:14). "మోషే కాదేషు నుండి ఎదోము రాజునొద్దకు దూతలను పంపి - నీ సహోదరుడగు ఇశ్రాయేలు అడుగునదేమనగా మాకు వచ్చిన కష్టము యావత్తును నీకు తెలిసినది.

బి. వారి పితరుల సమస్యలను మోషే వారికి జ్ఞాపకం చేయుట.

సంఖ్యాకాండము 20:15, "మా పితరులు ఐగుప్తునకు వెళ్ళిరి. మేము చాలదినములు ఐగుప్తులో నివసించితిమి. ఐగుప్తీయులు మమ్మును మా పితరులను శ్రమపెట్టిరి".

సి. వారి ప్రార్థనలకు ప్రభువు సమాధానమిచ్చు చున్నాడని మోషే చెప్పుట. సంఖ్యాకాండము 20:16, "మేము యెహోవాకు మొరపెట్టగా ఆయన మా మొఱను విని, దూతను పంపి ఐగుప్తులో నుండి మమ్మును రప్పించెను..."

డి. వారు ఎక్కడ ఉన్నారో దానిని గూర్చి మోషే వారికి చెప్పుట (సంఖ్యా 20:16) "ఇదిగో మేము నీ పొలిమేరల చివర కాదేషు పట్టణములో ఉన్నాము".

ఇ. సురక్షితమైన ప్రయాణం కొరకు మోషే విన్నపము (సంఖ్యా 20: 17). "మమ్మును నీ దేశమును దాటి పోనిమ్ము. పొలములలో బడియైనను

ద్రాక్షతోటలలో బడియైనను వెళ్ళము. బావులలో నీళ్ళుత్రాగము, రాజమార్గ మున నడచి పోయెదము నీ పొలిమేర లను దాటువరకు కుడివైపుకైనను, ఎడమవైపు నకైనను తిరుగకుండ పోయెదమని చెప్పించెను".

ఎఫ్. ఎదోమీయులు ఒకసారి ఇశ్రాయేలు దారికి అడ్డపడుట (సంఖ్యా 20:18). "ఏదోమీయులు నీవు నా దేశములోబడి వెళ్ళకూడదు. నేను ఖడ్గముతో నీకు ఎదురుగా వచ్చెదను సుమీ అని అతనితో చెప్పగా".

జి. రెండవసారి ఇశ్రాయేలు బ్రతిమలాడుట (సంఖ్యా 20:19) "ఇశ్రాయేలీయులు-మేము రాజ మార్గముననే వెళ్ళెదము. నేనును నా పశువులును నీ నీళ్ళు త్రాగునెడల వాటి విలువ నిచ్చుకొందును. మరేమిలేదు కాలినడకనే దాటిపోవుదును అంతే అని అతనితో చెప్పినపుడు"

హెచ్. రెండవసారి ఎదోమీయులు తిరస్కరించుట (సంఖ్యా 20:20). "అతడు నీవు రానేకూడద నెను. అంతట ఎదోము బహుజనము తోను మహాబలముతోను బయలుదేరి వారి కెదురుగా వచ్చెను".

2. ఇశ్రాయేలు ఎదోమును పాలించుట.

ఎ. ఎదోమీయులపై ఇశ్రాయేలు అధిపత్యమును గూర్చి బిలాము ప్రవచనములు.

1. సంఖ్యాకాండము 24:18 " ఎదోమును శేయీరును ఇశ్రాయే లుకు శత్రువులు. వారు స్వాధీనపరచ బడుదురు. ఇశ్రాయేలు పరాక్రమ మొందును.

బి. రాజైన దావీదు ఎదోమును జయించెను.

1. దినవృతాంతములు 18:13 "దావీదు ఎదోములో కావలి సైన్యము ను ఉంచెను, ఎదోమీయులందరును అతనికి సేవకులైరి".

3. ఇశ్రాయేలీయులకు వ్యతిరేకముగా ఎదోము తిరుగుబాటు.

ఎ. రాజైన సొలోమోను దేవునికి వ్యతిరేకముగా పాపము చేసినపుడు ఎదోము రాజును దేవుడు లేపెను.

1. 1 రాజులు 11:1-17. "దావీదు ఎదోము దేశము మీద యుద్ధము చేయుచుండగా సైన్యాధిపతి యైన యోవాబు చంపబడిన వారిని పాతిపెట్టుటకు వెళ్ళియున్నప్పుడు ఎదోము దేశమందున్న మగవారినంద రిని హతము చేసెను. ఎదోములో నున్న మగవారినందరిని హతము చేయు వరకు ఇశ్రాయేలీయులందరితో కూడ యోవాబు ఆరు నెలలు అచ్చట నిలిచెను. అంతట హదదును అతనితో కూడ అతని తండ్రి సేవకులలో కొందరు ఎదోమీయులును ఐగుప్త దేశములోనికి పారిపోయిరి. హదదు అప్పుడు చిన్నవాడై యుండెను".

2. 1 రాజులు 11:21,22, "అంతట దావీదు తన పితరులతో కూడ నిద్రపొందిన సంగతిని, సైన్యాధి పతియైన యోవాబు మరణమైన సంగతిని ఐగుప్తుదేశమందు హదదు విని నేను నా స్వదేశమునకు వెళ్ళుటకు సెలవిమ్మని ఫరోతో మనవి చేయగా, ఫరో-నీవు నీ స్వదేశమునకు వెళ్ళ గోరుటకు నాయొద్ద నీకేమి తక్కువైనది అని యడిగెను. అందుకు హదదు-తక్కువైనదేదియు లేదు గాని యేలాగున నైనను నన్ను వెళ్ళనిమ్మనెను".

బి. యెహోరాము దినములలో ఎదోము తనకు తాను రాజుగా చేసి కొనెను.

1. 2రాజులు 8:16, "అహాబు కుమారుడును ఇశ్రాయేలు వారికి రాజు నైన యెహోరాము ఏలుబడిన అయిదవ సంవత్సరమందు యెహో షాపాతు యూదా రాజై యుండగా యూదా రాజైన యెహోషాపాతు కుమారుడైన యెహోరాము ఏలనారంభించెను".

2. 2రాజులు 8:20, "ఇతని దినములలో ఎదోమీయులు యూదా రాజునకు ఇక లోబడుట మాని అతని మీద తిరుగుబాటు చేసి, తమ మీద నొకని రాజుగా నియమించుకొని నందున".

**III. గ్రంథము నుండి వర్తమానము :**

ఎ. ఎదోము గర్వము (3వచనం).

1. ఎదోము నమ్మకము అసత్య మైనది.

ఎ. "పక్షిరాజు గూడంత

యెత్తున నివాసము చేసికొని నక్షత్రములలో నీవు దాని కట్టినను అచ్చట నుండియు నేను నిన్ను క్రిందపడ వేతునని దేవుడు దానితో చెప్పెను" (వచనం 4)

బి. చోరులే గాని రాత్రి కన్నము వేయువారేగాని నీ మీదికి వచ్చిన యెడల తమకు కావలసినంత మట్టుకు దోచుకొందురుగదా. ద్రాక్ష పండ్లను ఏరువారు నీ యొద్దకు వచ్చిన యెడల పరిగి యేరుకొనువారికి కొంత యుండనిత్తురు గదా, నిన్ను చూడగా నీవు బొత్తిగా చెడిపోయి యున్నావు. ఏశావు సంతతి వారి సొమ్ము సోదా చూడబడును. వారు దాచిపెట్టిన ధన మంతయు పట్టబడును" (5,6 వచనం)

2. ఆ రోజున ఆయన కనపరచును.

ఎ. ఆమె యొక్క మిత్రులు ఆమెను అప్పగించును (7వచనం)

బి, ఆమె యొక్క జ్ఞానులు విఫలమైరి (8వ వచనం)

సి. ఆమె యొక్క బలాఢ్యులు విస్మయమొందుదురు (9వ వచనం).

బి. తన సోదరియైన యూదాను ఎదోము బాధపెట్టినది మరియు హింసించినది.

1. యెరూషలేము నాశనం గావించబడినపుడు ఎదోము సహాయం చేయలేదు (10వ వచనం)

ఎ. యెరూషలేము దోచుకొనబడినపుడు ఎదోము ఆదరించుటకు తిరస్కరించెను (10,11 వచనములు)

బి. యూదాకు జరిగిన దానిని బట్టి ఎదోము సంతోషించెను మరియు సంతృప్తిపడెను (12,13 వచనములు)

సి. ఎదోము దోచుకొనబడిన వాటిని పంచుకొనెను (13 బి)

డి. తప్పించుకొని పారిపోతున్న వారిని ఆమె సంహరించినది మరియు వారిని శత్రువులకు అప్పగించినది (14వచనం)

2. ఎదోమును గూర్చి విలాప వాక్యముల గ్రంధములో యిర్మియా ఒక ప్రవచనం చెప్పెను (విలాపవాక్యం 4:19).

3. ఎదోము పాపములు ప్రభువు కనుగొనును (విలాపవాక్యం 4:22).

సి. ఎదోము శిక్షకు గురికాబోవుచున్నది

1. ఇశ్రాయేలీయులకు వారు ఏమి చేసిరో అదే వారికిని చేయ బడును.

ఎ. ఓబద్యా 1:1 "యెహోవా దినము అన్యజనులందరికి వచ్చు చున్నది. అప్పుడు నీవు చేసినట్టే నీకును చేయబడును, నీవు చేసినదే నీ నెత్తి మీదికి వచ్చును".

బి. గలతీ 6:7 "మోసపోకుడి, దేవుడు వెక్కిరింపబడదు, మనుష్యుడు ఏమి విత్తునో ఆ పంటనే కోయును".

2. ఎదోము ఇక ఎన్నటికిని కనబడకపోవును.

ఎ. ఓబద్యా 1:16 "వారు నా పరిశుద్ధమైన కొండ మీద త్రాగినట్లు అన్యజనులందరును నిత్యము త్రాగుదురు, తాము ఇకనెన్నడు నుండని వారై నట్లు వారేమియు మిగులకుండ త్రాగుదురు".

బి. ద్వితీ.కా. 32:35, "వారి కాలు జారుకాలమున పగతీర్చుటయు ప్రతిఫలమిచ్చుటయు నీవే, వారి ఆపద్దినము సమీపించును వారి గతి త్వరగా వచ్చును వారికాధారము లేక పోవును".

డి. ఇశ్రాయేలు పునరుద్ధరించ బడెను.

1. ఇశ్రాయేలు యొక్క విడుదల వాగ్దానం చేయబడును. ఓబద్యా 1: 1:7-9, "అయితే సీయోను కొండ ప్రతిష్ఠితమగును, తప్పించుకొనిన వారు దాని మీద నవశింతురు",

2. ఇశ్రాయేలు తమ స్వాస్థము లు తిరిగి పొందుదురు. ఓబద్యా 1: 1:7-6, "యాకోబు సంతతి వారు తమ స్వాస్థములను స్వతింత్రించు కొందురు".

3. ఎదోము మీద ఇశ్రాయేలు అగ్నియు మరియు మంటయు వలె ఉందురు.

ఓబద్యా 1:9; 8:9 "మరియు యాకోబు సంతతి వారు అగ్నియు, యోసేపు సంతతి వారు మంటయు అగుదురు".

4. ఎదోము సంతతిలో ఎవడును మిగిలియుండరు. ఓబద్యా 1:18, "ఏసావు సంతతివారిలో ఎవడును తప్పించుకొనకుండ యోసేపు సంతతి వారు వారిలో మండి వారిని కాల్చుదురు".

5. ఇశ్రాయేలు పునరుద్ధరించబడినది.

ఓబద్యా 1:18, "యెహోవా మాట యిచ్చియున్నాడు".

**IV. ఓబద్యా గ్రంథము యొక్క క్లుప్త వివరణ.**

ఎ. ఎదోము మీద దేవుని ప్రతీకారము (1-16).

1. ఇది నిశ్చయముగా జరుగును (1-9).

2. ఇది ఒక కారణము కొరకు (10-16).

బి. ఇశ్రాయేలు కొరకు దేవుని విజయము (17-21).

1. ఇది వాగ్దానం చేయబడెను (17-18).

2. ఇది సంపూర్తి చేయబడెను (19-21).

**V. ఓబద్యా గ్రంథము నుండి పాఠములు**

ఎ. నాశనమునకు ముందు గర్వము నడుచును.

1. గర్వము తనకు తాను చూచుకొనును. ఎదోము చెప్పుకొనినట్లుగా, "నన్ను క్రిందికి పడద్రోయగలవాడెవడు?

ఎ. సామెతలు 16:18 "నాశనమునకు ముందు గర్వము నడచును, పడిపోవుటకు ముందు అహంకారమైన మనస్సు నడచును".

బి. కీర్తనలు 10:4 "దుష్టులు పొగరెక్కి యెహోవా విచారణ చేయడను కొందురు. దేవుడు లేడని వారెల్లప్పుడు యోచించెదరు".

2. ఎదోము ఇతరులను బాధపెట్టిన రీతిగా అది తన సోదరిని (యూదా) బాధపెట్టినది అనునది ఈ గ్రంథము యొక్క ప్రాముఖ్యమైన బయల్పాటు.

బి. మనం దేనిని విత్తుదుమో దానినే కోయుదుము.

1. ఓబద్యా 1:16 "నీవు చేసినదే నీ నెత్తిమీదికి వచ్చును".

2. గలతీ 6:7 "...మనుష్యుడు ఏమి విత్తునో ఆ పంటనే కోయును".

సి. నీతి ఒక దేశమును హెచ్చించును.

1. సామెతలు 14:34, "నీతి జనములు ఘనతకెక్కుటకు కారణము,

పాపము ప్రజలకు అవమానము తెచ్చును".

2. లూకా 14:11 "తన్ను తాను హెచ్చరించుకొను ప్రతివాడును తగ్గించ బడును తన్ను తాను తగ్గించుకొను ప్రతి వాడును హెచ్చింపబడును".

డి. దేవుని వాక్యము స్థిరమైనది.

1. ఇతర ప్రవక్తల చేతకూడా ఎదోము నాశనము గూర్చి వ్రాయబడినది.

ఎ. యెషయా దీనిని గూర్చి ముందుగా చెప్పెను. యెషయా గ్రంథము 11:13,14, "ఎఫ్రాయిము కున్న మత్సర్యము పోవును. యూదా విరోధులు నిర్మూలమగుదురు, ఎఫ్రాయిము యూదా విరోధులు నిర్మూలమగుదురు, ఎఫ్రాయిము యూదా యందు మత్సరపడడు, యూదా ఎఫ్రాయిమును బాధింపదు వారు ఫిలిష్తీయుల భుజము మీద ఎక్కుదురు మడమటివైపున పరుగెత్తి పోవుదురు, ఏకీభవించి తూర్పు వారిని దోచుకొందురు, అమ్మోనీయులు వారికి లోబడుదురు".

బి. యిర్మియా దీనిని గూర్చి ప్రవచించెను (యిర్మియా 49:7-10).

"సైన్యములకధిపతియగు యెహోవా ఎదోమును గూర్చి ఈలాగు సెలవిచ్చు చున్నాడు. తేమానులో జ్ఞానమికనేమియు లేదా? వివేకులకు ఇక ఆలోచన లేకపోయెనా? వారి జ్ఞానము వ్యర్థమాయెనా? ఏశావును విమర్శించుచు నేనతనికి కష్టకాలము రప్పించుచున్నాను. దదానీయులారా, పారిపోవుడి వెనుకకు మళ్ళుడి బహు లోయన దాగుకొనుడి. ద్రాక్షపండ్లు ఏరు వారు నీ యొద్దకు వచ్చిన యెడల వారు పరిగెలను విడువరా? రాత్రి దొంగలు వచ్చిన యెడల తమకు చాలునంత దొరుకువరకు నష్టము చేయుదురు గదా? నేను ఏశావును దిగంబరినిగా చేయుచున్నాను. అతడు దాగియుండ కుండునట్లు నేనతని మరుగు స్థలమును బయలు పరచుచున్నాను. అతని సంతానమును అతని స్వజాతివారును అతని పొరుగు వారును నాశనమగు చున్నారు.

సి. ఆమోసు దానిని చూచెను (ఆమోసు 1:11). యెహోవా సెలవిచ్చున దేమనగా ఎదోము మూడు

సార్లు నాలుగు సార్లు చేసిన దోషము లను బట్టి నేను తప్పకుండ వానిని శిక్షింతును. ఏలయనగా వాడు కనిక రము చాలించుకొని ఖడ్గము పట్టు కొని యెడతెగని కోపముతో తనకు సహోదరు లగు వారిని మానక చీల్చుచు వచ్చెను".

డి. మలాకీ దీనిని గూర్చి ప్రకటించెను. (మలాకీ 1:1-4).

"...ఏశావును ద్వేషించి అతని పర్వతములను పాడుచేసి అతని స్వాస్థ మును అరణ్యమందున్న నక్కలపాలు చేసితిని. ఎదోము పాడైన స్థలములను మరల కట్టుకొనినను నేను వాటిని క్రింద పడద్రోయుదును. లోకులు వారి దేశము భక్తిహీనుల ప్రదేశమనియు, వారు యెహోవా నిత్యకోపాగ్నికి పాత్రులనియు పేరు పెట్టుదురు".

ఇ. ఓబద్యా దానిని దర్శనము లో చూచెను (ఓబద్యా 1:1-3).

"ఓబద్యాకు కలిగిన దర్శనము ఎదోమును గురించి ప్రభువగు యెహోవా సెలవిచ్చునది. యెహోవా యొద్ద నుండి వచ్చిన సమాచారము మాకు వినబడెను. -ఎదోము మీద యుద్ధము చేయుదము లెండని జనులను రేపుటకై దూత పంపబడి యున్నాడు. నేను అన్యజనులలో నిన్ను అల్పునిగా చేసితిని. నీవు బహుగా తృణీకరింపబడుదువు. అత్యున్నతమైన పర్వతముల మీద ఆసీనుడవైయుండి కొండసందులలో నివసించువాడా - నన్ను క్రిందికి పడద్రోయ గల వాడెవడ ని అనుకొనువాడా, నీ హృదయపు గర్వము చేత నీవు మోస పోతివి".

2. దేవుని మాట ఎన్నడు నిరర్థకము కానేరదు.

ఎ. ఆయన వాక్యము సత్యమై నది (కీర్తనలు 119:160).

"నీ వాక్యసారాంశము సత్యము, నీవు నియమించిన న్యాయవిధులన్నియు నిత్యము నిలుచును".

బి. ఆయన తీర్పు న్యాయమై యున్నది (కీర్తనలు 119:75).

"యెహోవా నీ తీర్పులు న్యాయ మైన వనియు, విశ్వాస్యత గలవాడవై నీవు నన్ను శ్రమపరచితివనియు నేనెరుగుదును"

సి. ఆయన వాక్యము నిష్ఫలము కానేరదు (యెషయా 5:11).

"...అలాగే నానోట నుండి

వచ్చు వచనమును ఉండును. నిష్ఫలముగా నా యొద్దకు మరలక అది నాకు అనూకూలమైనదాని నెరవేర్చును".

ఇ. దేవుని శక్తి మానవుల మీదికి వ్యతిరేకముగా వచ్చినపుడు వారి రక్షణ పూర్తిగా నిరుపయోగమగును.

1. భద్రత అనునది మనుష్యుల బలములోగాని, గొప్పతనంలో గాని, వారి జ్ఞానములోగాని లేక గొప్ప జాతిని బట్టి గాని ఉండదు దేవునిలో తప్ప అని ఓబద్యా స్పష్టముగా తెలియపర్చెను.

2. కీర్తనాకారుడు దానిని ఎలుగెత్తి చెప్పెను (కీర్తనలు 127:1).

"యెహోవా ఇల్లు కట్టించని యెడల దాని కట్టువారి ప్రయాసము వ్యర్థమే. యెహోవా పట్టణమును కాపాడని యెడల దాని కావలికాయువారు మేలుకొనియుండుట వ్యర్థమే".

ఎఫ్. ఇతరుల ఆపదను చూచి సంతోషపడుట మరియు వారి దురదృష్టమును చూచి సంతృప్తిపడుట తప్పు (సామెతలు 17:5, యోబు 31: 29-29).

1. యూదా దురదృష్టం బట్టి ఏదోము సంతోషించెను.

2. చెడుచేసి వాటిలో సంతోషమును వెదుకువారుగా అన్యులు పౌలు చేత వర్ణించబడిరి (రోమా1:23).

3. ప్రేమ దుర్నీతి విషయమై సంతోషపడదు (1కొరింధీ 13:6) మరియు క్రైస్తవులు శ్రమ పడుదురు. మరియు సంతోషించు వారితో సంతోషించుదురు (1 కొరింధి 12:26).

జి. ఒకడు చెడు జరిగించుటను పంచుకొనినపుడు లేక సమ్మతించినపుడు అతడు వాటిలో భాగమగును. లేక అతని చెడుక్రియలలో ఇతడు పాలిభాగస్తుడగును (2యోహాను 9-11).

ముగింపు :

గ్రంధము యొక్క నేపద్యము.

ఎ. గ్రంధము యొక్క నేపద్యము

బి. గ్రంధము యొక్క అంశము

సి. గ్రంధము యొక్క వర్తమానము

డి. గ్రంధము యొక్క క్లుప్త ఆకారాది పట్టిక

ఇ. గ్రంధము నుండి ఆచరణాత్మక పాఠములు.

- రోనీగూటం, కాకినాడ

# సంక్షిప్త వార్తలు

మీ చేతిలో యున్న సంచికతో సత్యవాక్కు 42వ సంవత్సరములో ప్రవేశించి యున్నదనుటకు సంతోషముతో తెలియ జేయుచున్నాము. గత 42 సంవత్సరములుగా ఏ ఒక్క మాసము ఈ పత్రిక ప్రచురణ ఆపుచేయబడలేదు, ప్రతినెలా ప్రభుత్వము వారు నిర్దేశించిన సమయానికి పదివేల మందికి పైగా ఈ పత్రిక అందజేయబడుచున్నది. ఇంతవరకు మనకు సహాయము చేసిన దేవునికి స్తోత్రములు; ఈ పదివేల మందిలో బహుస్వల్ప సంఖ్యాకులు మాత్రమే తమ సంవత్సర సభ్యత్వరుసుము పంపుచున్నారు, మీరిప్పుడు ఫోన్ ద్వారా కూడ ఆ రుసుము పంపవచ్చును, 9912286255 కి ఫోన్ ద్వారా పంపి, మీ అడ్రసును సత్యవాణి ఆఫీసుకు తెలియజేయండి.

కరోనా కోవిడ్–19 వలన లాక్‌డౌన్ ఇంకను కొనసాగుచునే యున్నది. యిటు ఆంధ్రలోను, అటు దేశమంతటా ఆ వ్యాధి బారిన పడినవారి సంఖ్య పదిన్నర లక్షలు దాటినది, కాకినాడలో మరి విపరీతముగా వ్యాపించుచున్నది.అయినను దేవుని మహా కృపనుబట్టి సత్యవాణి ఆఫీసు నిరాటంకముగా పని చేయుచున్నది, వేల కొలది ప్రజలు బైబిలు కోర్సులో చేరియున్నారు, పదివేలకు పైగా ఈ పత్రిక సకాలమునకు అందుకొనుచున్నారు, అనేక పుస్తకములు తెలుగు,ఒరియా భాషలలో ముద్రించబడుచున్నాయి. దేవుని పనికి అభ్యంతరము కలుగలేదు.

కాకినాడ లోను, తూర్పు గోదావరి జిల్లాలోను కరోనా సంబంధిత సమస్య వలన గత రెండు వారములుగా కర్ఫ్యూ విధించబడినది, అందువలన స్థానిక క్రీస్తు సంఘము ఉదయం 7:45 గం॥లకే ఆరాధనకు కూడుకొనుచున్నారు. కొందరు రాగలుగుచున్నారు. మరికొందరు తమ యిండ్లలోనే ఆరాధించి, ప్రభురాత్రి భోజనము జరిపించుకొనుచున్నారు.

సత్యవాణి స్కూల్ ఆఫ్ ఇవాంజలిజమ్ రెండవ బ్యాచ్ యొక్క గ్రేడ్యుయేషన్ జూలై 10వ తేది నాడు ఘనముగా జరిగినది. పదిమంది విద్యార్థినీ విద్యార్థులు ఆ కోర్సును విజయవంతముగా పూర్తిచేసిరి. వారికి ఒక యోగ్యతా పత్రము, కొంత

నగదు, ఇంచుమించు 30 పుస్తకములు బహూకరించబడినవి, ప్రస్తుతము మూడవ బ్యాచ్ జరుగుచున్నది, ఇప్పుడా స్కూల్‌లో జరుగు బోధనను ఆన్‌లైన్‌లో కూడ లభింప జేయుట వలన తెలుగు రాష్ట్రాలలో వందలాది విద్యావంతులు దానిలో పాల్గొనుచున్నారు, కరోనా సంబంధమైన విపత్తు తొలగిపోగానే స్థానికేతరులు కూడ వచ్చి నేర్చుకొనుటకు అవకాశము కల్పించబడును. నాల్గవ బ్యాచ్ ఆగష్టు 24 న మొదలగును ఇందులో చేరుటకు ఆసక్తి కల్గిన వారు వివరములకు మా ఆఫీసును సంప్రదించగలరు. దీనిని బాగుగా నడిపించుట కొఱకు సహోదరులు రోనిగూటం గారిని మీ ప్రార్ధనలో పెట్టగలరు.

కరోన విపత్కర కాలములో ఆర్ధిక ఇబ్బందులు పడుచున్నవారికి రిక్కిగారు వేలాది గృహములకు ఉచితముగా బియ్యము, పప్పులు, మొదలగు ఆహార పదార్ధములను అందజేయుచున్నారు, ప్రభుత్వము వారు ఆయన సేవలను ప్రశంసించుచున్నారు.


RNI Regd. No. 69973/98
Postal Regd. No. AP/KD-02/2018-2020

**సత్యవాక్కు**

పోస్టుబాక్సు-80
కాకినాడ - 533 001
ఆంధ్రప్రదేశ్

ప్రచురణ తేదీ: ప్రతీ నెల 9వ తేదీ
పోస్టు చేయు తేదీ: ప్రతీ నెల 15వ తేదీ

ఎడిటెడ్ & పబ్లిష్డ్ బై జాషువా గూటమ్. ప్రింటెడ్ బై హిమ్ ఎట్ సత్యవాణి పబ్లికేషన్స్, సాంబమూర్తి స్ట్రీట్, కాకినాడ 533004